www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 13 సెప్టెంబర్ 2023
5
తిరుపతి

శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో సెప్టెంబర్ 18 నుండి 26వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఆగమోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీలోని అన్ని విభాగాలు సమన్వయంతో విస్తత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో టీటీడీ ఈఓ ఏవి ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు సుబ్బరాజు, తిప్పేస్వామి, సివిఎస్వో నరసింహ కిషోర్ పాల్గొన్నారు.

'స్వర్ణ'ముఖిలో ఇసుక 'తోడే'ళ్లు..!

స్వర్ణముఖి నది ఒకప్పుడు ఇక్కడి ప్రజలకు జీవనాధారంగా, తాగునీటి కొరత తీర్చేదిగా ఉండేది.. ప్రస్తుతం అధికార వైసిపి 'వ్యాపారానికి' అనువుగా మారింది.. ఇసుక తోడేళ్లు ఎద్దులబండ్లు తెచ్చి తవ్వేస్తున్నారు. ఎంచక్కా అపార్టుమెంట్ల ముందు గుట్టలు గుట్టలుగా నింపుతున్నారు.. గుట్టుచప్పుడు కాకుండా పక్క రాష్ట్రమైన తమిళనాడుకు యథేచ్ఛగా తరలిస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారన్న విమర్శలున్నాయి.. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావును వివరణ కోరగా, అందరూ ఎద్దుల బండ్లపై ఇసుక తీసుకెళుతున్నారని, వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోలేమని చెప్పడం గమనార్హం. ఏదిఏమైనా ఇసుక తోడేళ్లకు ఉన్నతాధికారుల సహకారం యథేచ్ఛగా అందుతోందన్నది స్థానికుల వాదన. కొన్నాళ్లు పోతే స్వర్ణముఖి నది కాలగర్భంలో కలిసిపోయినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని ప్రకృతి ప్రేమికులు వాపోతున్నారు.

గుట్టుచప్పుడు కాకుండా 'గుట్ట'లు తరలింపు
పక్క రాష్ట్రాలకు యథేచ్ఛగా వ్యాపారం
కోట్లకు పడగలెత్తుతున్న అధికార 'బిల్డర్లు'

ప్రజాశక్తి - నాయుడుపేట

నాయుడుపేట స్వర్ణముఖి నదిలో ఇసుక రోజురోజుకూ మాయమైపోతోంది. ఒకప్పుడు బంగారు వర్ణంలో మెరిసిపోతూ కళకళలాడే స్వర్ణముఖి నది నేడు ఇసుక పూర్తిగా మాయమై వ్యర్థాలతో కకావికలంగా మురికికూపంగా కనిపిస్తోంది. అధికారులు ఆదారిన పోతూ ముక్కు మూసుకుని పోతున్నారే తప్ప జీవనదిని కాపాడుకోవాలన్న ఆలోచన అధికారులకు, పాలకులకు లేకపోవడం గమనార్హం. నిర్మాణంలో ఉన్న ప్రతి అపార్టుమెంట్ ముందు ఇసుక గుట్టలు గుట్టలుగా దర్శనమిస్తుంది. ఇసుక మొత్తం ఇలాగే తవ్వేస్తే నీటినిల్వ చేసే పరిస్థితి లేక భవిష్యత్‌లో జనం నీళ్లకోసం పరుగులు తీసే దుస్థితి ఎంతో దూరంలో లేదన్నది వాస్తవం. కమర్షియల్ కట్టడాలకు సముద్రం నుంచి వెలువడే ఇసుకను ఇసుక రీచ్‌లుగా మార్చుకుని అక్కడనుంచి ఇసుకను భారీ కట్టడాలకు వాడుకోవాలని సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన విధానం. అయితే ఈ విధానాన్ని తుంగలో తొక్కి కక్కుర్తితో బిల్డర్లు, కాంట్రాక్టర్లు 'అమ్మ'లాంటి నదిలోని ఇసుకను ఎద్దులబండ్లు తెచ్చి మాయం చేసేస్తున్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో' ఇల్లిల్లు తిరుగుతున్న నాయకులకు నిర్మాణంలో ఉన్న ప్రతి ఇంటి ముందు స్వర్ణముఖి ఇసుక గుట్టలు గుట్టలుగా ఉన్నా కనిపించకపోవడం గమనార్హం. ఇకనైనా పాలకులు స్పందించి స్వర్ణముఖికి పూర్వవైభవం తీసుకురావాలని, వ్యర్థాలను తొలగించి, ఇసుక తవ్వకాలను ఆపాలని ప్రజలు కోరుతున్నారు.

'సముద్రయాన్' ప్రయోగానికి చురుగ్గా ఏర్పాట్లు

- 'బ్లూ ఎకానమీ' ద్వారా 4శాతం వృద్ధిరేటు
- తిరుపతి టెక్నాలజీ సదస్సులో డాక్టర్ రవిచంద్రన్

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

గగన్‌యాన్ తరహాలో సముద్రయాన్‌కు భారత శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారనీ, వచ్చే ఏడాది ఈ ప్రాజెక్టును ప్రారంభించే అవకాశం ఉందని కేంద్ర భూ శాస్త్రాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి, ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ రవిచంద్రన్ చెప్పారు. డీప్ ఓషన్ టెక్నాలజీ మిషన్లో భాగంగా సముద్ర వనరులు, సముద్ర గర్భంలోని జీవ వైవిధ్యంపై అధ్యయనం చేసేందుకు ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్లు ఆయన వివరించారు. తిరుపతి ఇన్నోవేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ, విజ్ఞానభారతి సంయుక్తంగా తిరుపతి ఐఐటీలో మంగళవారం నేషనల్ సైన్స్ అండ్ టెక్నాలజీ మిషన్స్ పై నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో డాక్టర్ రవిచంద్రన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ముగ్గురు అక్వానాట్స్‌తో ప్రయాణం చేయడానికి అనువైన జలాంతర్గామిని ఈ పరిశోధనకు సిద్ధం చేస్తున్నట్లు డాక్టర్ రవిచంద్రన్ పేర్కొన్నారు. అంతేకాకుండా సముద్ర జల చరాలను గుర్తించడమే కాకుండా వాటి పరిరక్షణకు డీప్ సీ డైవర్సిటీ పరిశోధన జరుగుతుందన్నారు. ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్స్ వంటి సముద్ర ఆర్థిక వనరులను సమగ్రంగా గుర్తించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటుందన్నారు. భారత ఆర్థిక వద్ధి రేటులో 4 శాతం బ్లూ ఎకానమీ ద్వారా సమకూరుతున్నట్లు రవిచంద్రన్ వివరించారు.

గౌరవ అతిథిగా విచ్చేసిన నీతి ఆయోగ్ మెంబర్, ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ కే.సారస్వత్ మాట్లాడుతూ సమాజ స్థితి గతులను సైన్స్ మారుస్తుందన్నారు. స్థిరమైన సమాజం కోసం శాస్త్ర సాంకేతిక రంగాన్ని సమగ్రంగా అభివద్ధి చేసుకోవాలన్నారు. టెక్నాలజీ ద్వారా సంపదను సష్టించుకోవాలని సూచించారు. డీఆర్డీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్ బికే దాస్ డీఆర్డీవో సాధించిన ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భారత రాడార్లు, ఆయుధాల సామర్థ్యాన్ని వివరిస్తూ టెక్నాలజీ వద్ధి కోసం డీఆర్డీవో చేస్తున్న కషిని వివరించారు.

శాంతాబయోటెక్ వ్యవస్థాపకులు డాక్టర్ వరప్రసాదరెడ్డి మాట్లాడుతూ, జ్ఞానం లేని విద్య, మానవత్వం లేని మనిషి వ్యర్థమన్నారు. హెపటైటిస్ బి వ్యాక్సిన్ ను తయారు చేసిన నేపథ్యాన్ని వివరిస్తూ, కష్టాన్ని నమ్ముకున్న ప్రతి ఒక్కరూ సత్ఫలితాలను సాధిస్తారన్నారు. తిరుపతి ఐఐటి డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ తన స్వాగతోపన్యాసంలో ఐఐటీ గురించి వివరించారు. పరిశోధనలను పెంచేందుకు జరుగుతున్న కృషిని వివరించారు. తిరుపతి ఐఎస్‌టీఎఫ్ ప్రెసిడెంట్ డాక్టర్ డి నారాయణరావు మాట్లాడుతూ, సైన్స్ అండ్ టెక్నాలజీ పై విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లకు సమగ్రమైన అవగాహన కల్పించడమే కాకుండా తగినవిధంగా ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ఐఎస్‌టిఎఫ్ ప్రారంభించామన్నారు. ఈ వేదిక ద్వారా పరిశోధనల అవకాశాలను మెరుగుపర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఐటి డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ, విజ్ఞానభారతి ప్రతినిధి త్రిస్టా ఠాకూర్, ఐఎస్టిఎఫ్ కార్యదర్శి టి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యం విశాలమైనది : డాక్టర్ బి.తేజవాణి

ప్రజాశక్తి - క్యాంపస్

తెలుగు సాహిత్యం ఎంతో విశాలమైనదని, విస్తతమైనదని దీని లోతుపాతులు ఎత్తుపల్లాలు తెలిసిన మహా పండితులకే అర్థమవుతుందని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ బి.తేజవాణి పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం తెలుగు అధ్యయనశాఖలో తెలుగు సాహితీ సమితి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుశాఖ విభాగాధిపతి కొలకలూరి మధుజ్యోతి అధ్యక్షత వహించారు. డాక్టర్ బి.తేజవాణి మాట్లాడుతూ సాహిత్యం అనేదివిశాలమైనది, విస్తతమైనది అని అన్నారు. యుగపురుషుడు కందుకూరి వీరేశలింగం స్త్రీ విద్యను ప్రోత్సహించారని అన్నారు. గరిమెళ్ళ సత్యనారాయణ రాసినటువంటి మాకొద్దీ తెల్లదొరతనం పాటలోని దేశభక్తి గురించి కొనియాడారు. జాషువా పోరాటపటిమను, కొలకలూరి ఇనాక్ సాహిత్య స్ఫూర్తిని తెలిపారు. తెలుగు సాహితీ సమితి కార్యక్రమానికి సలహాదారు డాక్టర్ డి.యువశ్రీ మాట్లాడుతూ సాహితీ సమితి కార్యక్రమానికి అనేకమంది సాహితీవేత్తలను శాఖకు పిలిపించి వారితో సందేశం ఇప్పించడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వై.సుభాషిని, డాక్టర్ బి.లక్ష్మీప్రియ, విద్యార్థినిలు పాల్గొన్నారు.

నిమజ్జన కమిటీ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

వినాయక మహోత్సవ కమిటీ కార్యాలయాన్ని మంగళవారం ఇందిరా మైదానంలో గల స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రారంభించారు. చవితి వేడుకలను ఐక్యంగా నిర్వహించి మూడోరోజు నిమజ్జనం పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, ఊకా విజయ్ కుమార్ ,వెంకటేష్ గుండాల గోపీనాథ్, డిప్యూటీ మేయర్లు అభినయ రెడ్డి, ముద్ర నారాయణ, కార్పొరేటర్లు వెంకటేశులు, నరసింహ చారి, టౌన్ బ్యాంక్ వైస్ ఛైర్మన్ వాసు, వారధి విష్ణు,తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన : టిడిపి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందని, మూడు రోజులుగా జరుగుతున్న పరిణామాలతో ప్రజలు భయాందోళన గురవుతున్నారని టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ విమర్శించారు. మంగళవారం సుగుణమ్మ నివాసం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో సుగుణమ్మ, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కిరణ్ రాయల్ మాట్లాడుతూ కక్షసాధింపు చర్యలు, నోరు తెరిస్తే అబద్దాలు, దౌర్జన్యాలు, కేసులు పెట్టడం సైకో పాలనను గుర్తు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు వూకా విజయకుమార్, దంపూరి భాస్కర్ యాదవ్, కార్పొరేటర్ ఆర్‌సి మునిక్రిష్ణ, రాజారెడ్డి పాల్గొన్నారు.

నీటి గుంటలో పడి చిన్నారి మృతి

ప్రజాశక్తి- కే వి బి పురం

నీటి గుంటలో పడి రెండేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన కె వి బి పురం మండలంలోని పెరిం దేశం గ్రామంలో చోటు చేసుకుంది.. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు పెరిం దేశం దళితవాడకు చెందిన నాగయ్య సుబ్బలక్ష్మి కుమార్తె నవ్య (2) అనే చిన్నారి ఇంటి వద్ద ఆడుకుంటూ పక్కనే ఉన్న నీటి తొట్టిలో ప్రమాదవశాత్తు పడి పడింది. కొంతసేపటికి చిన్నారి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు గాలించగా ఇంటి బయట ఉన్న తొట్టిలో చిన్నారి ఉండటాన్ని గమనించారు వెంటనే చిన్నారిని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి కి తరలించగా అప్పటికే చిన్నారి మతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా తయారీకి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024 తయారీకి అన్ని విధాలా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ కే వెంకట రమణ రెడ్డి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి తెలిపారు. మంగళవారం ఉదయం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా విజయవాడ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ తో పాటు, తిరుపతి ఈ ఆర్ ఓ హరిత పాల్గొన్నారు. రాజకీయ పార్టీల సమావేశంలో లేవనెత్తిన అంశాలపై తీసుకున్న చర్యలు పెండింగ్ లేకుండా సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. ఈ నెల 16 న రాష్ట్ర స్థాయిలో మొదటి ఎఫ్ ఎల్సి నిర్వహణ వర్క్ షాప్ ఉంటుందని జిల్లా కలెక్టర్లతో పాటు ఒక సీనియర్ సూపర్వైజరీ అధికారి హాజరు కావాల్సి ఉంటుందని సూచించారు. ఇంటింటి సర్వే లో 17,32,797 మంది ఓటర్లకు గాను 26719 మంది ఓటరుగా నమోదు కాని వారిగా గుర్తించి ఓటరు నమోదుకు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు. జిల్లా రెవెన్యూ అధికారి పెంచల్ కిషోర్, ఈ ఆర్ ఓ లు కనక నరసా రెడ్డి, కోదండ రామిరెడ్డి, కిరణ్ కుమార్, చంద్రముని, శ్రీనివాసులు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సురేష్, సిబ్బంది పవన్, జీవన్ పాల్గొన్నారు

వైఎస్సార్ బీమా క్లైమ్ దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ : జెసి

తిరుపతి టౌన్ : వైఎస్సార్ భీమా క్లైమ్ దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి క్లైమ్ లు సెటిల్ అయ్యేలా చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డి. కె బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు సంబంధిత అధికారులతో వైఎస్సార్ భీమా పథకం క్లైమ్స్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఎపిఎం లు అందరు పెండింగ్ లో ఉన్న వైఎస్సార్ భీమా క్లైమ్ ల పై ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు మరణించిన వ్యక్తి కుటుంబానికి కర్మ క్రియల ఖర్చులు నిమిత్తం ముందుగానే వారికి రూ.10 వేల రూపాయలు అందచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి జ్యోతి, డిఎల్‌డిఓలు ఆదిశేషరెడ్డి, వాణి, సుశీలా దేవి, డిపిఓ రాజశేఖర్ రెడ్డి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కష్ణారెడ్డి, రుయా హాస్పిటల్ సూపర్డెంట్ పార్థసారథి పాల్గొన్నారు.

విద్యార్థులను ఉద్యోగులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఎస్‌డిహెచ్‌ఆర్ ఫ్రెషర్స్‌డేలో అభినయ్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

విద్యార్థులను ఉద్యోగులుగా తీర్చిదిద్దడమే ఎస్‌డిహెచ్‌ఆర్ లక్ష్యమని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మహతి ఆడిటోరియంలో ఎస్‌డిహెచ్‌ఆర్ విద్యాసంస్థల ఫ్రెషర్స్‌డే జరిగింది. నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. డిప్యూటీ మేయర్ అభినయరెడ్డి మాట్లాడుతూ పది సంవత్సరాలకు పైగా తిరుపతిలో ప్రారంభించబడిన ఎస్ డి హెచ్ ఆర్ విద్యాసంస్థలలో చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతోపాటు ఆర్థికంగా ఎదిగేటట్లు చేయటం ఎంతో అభినందనీయమన్నారు. ఎస్డిహెచ్ ఆర్ విద్యాసంస్థల చైర్మన్ డివిఎస్ చక్రవర్తి రెడ్డి మాట్లాడుతూ తమ విద్యాసంస్థలలో క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంతోపాటు పలు ఎమ్ఎన్‌ఓ కంపెనీలతో ఒప్పందం చేసుకుని వేలాదిమంది విద్యార్థులను ఉద్యోగులుగా తీర్చిదిద్దిన ఘనత తమదేనన్నారు. అనంతరం సినీ మిమిక్రీ ఆర్టిస్టు శివారెడ్డి విద్యార్థులను ఎంతో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉషా పాల్గొన్నారు.

తిరుపతిలో అధునాతన 'గ్రోహెయిర్-గ్లోస్కిన్' క్లినిక్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

అత్యాధునిక సౌకర్యాలతో తిరుపతి నగర ప్రజలకు అందుబాటులో అధునాతన గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్ తన 24వ శాఖ ద్వారా సేవలను ప్రారంభించింది. తిరుపతి నగర పరిధిలోని ఏఐఆర్ బైపాస్ రోడ్డులో గ్రో హెయిర్ అండ్ గ్లో స్కిన్ ను మంగళవారం తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ ఆర్.శిరీష ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ శిరీష మాట్లాడుతూ గ్రోహెయిర్-గ్లోస్కిన్ క్లినిక్ లో మంచి అత్యాధునిక పరికరాలతో సేవలు అందించడానికి తిరుపతికి రావడం సంతోషంగా ఉందన్నారు. ఫ్రాంచైజీ యజమాని అశ్విన్ రాజ్, కీర్తన మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా ప్రజలకు అన్ని సౌకర్య వసతులతో ఈ గ్రో హెయిర్ అండ్ గ్లో స్కిన్ ఏర్పాటు చేశామన్నారు. హెయిర్ రీగ్రోత్ అండ్ స్కిన్ ట్రీట్‌మెంట్‌లో ప్రముఖ బ్రాండ్‌గా పేరుగాంచిన ఈ క్లినిక్, అత్యున్నతమైన సేవ, అత్యాధునిక సాంకేతికత, జుట్టు తిరిగి పెరగడానికి అందుబాటులో ఉన్న వెల్‌నెస్ సొల్యూషన్‌లను అందించడంలో అత్యంత ప్రాముఖ్యతనిస్తుందన్నారు. 2021లో అధునాతన గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్ మంచి ప్రజాధారణ పొందిందన్నారు. 2024 నాటికి 100 క్లినిక్ ల ఏర్పాటు లక్ష్యంగా ఉత్తమ సేవలతో అడుగులు వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, సురక్ష ఆస్పత్రి వైద్యులు హేమకుమార్ రెడ్డి, 15వ డివిజన్ కార్పొరేటర్ షాలిని మహేష్ రెడ్డి, శరణ్ వెల్ జె (బ్రాండ్ ఓనర్, ఎండి), క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షిత జోన్లుగా ఎత్తయిన నడకమార్గాలు

- యాత్రికుల భద్రత, వన్యప్రాణుల రక్షణా రెండూ ముఖ్యమే
- ఎపి వైల్డ్ లైఫ్ చీఫ్ వార్డెన్ మధుసూదన్‌రెడ్డి వెల్లడి

ప్రజాశక్తి - తిరుమల

యాత్రికుల భద్రతతోపాటు వన్యప్రాణుల సంరక్షణ రెండూ ముఖ్యమేనని, తిరుమల నడకమార్గాల్లో ఎత్తయిన నడకమార్గాలు ఏర్పాటుకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ వైల్డ్ లైఫ్ చీఫ్ వార్డెన్ మధుసూధన్ రెడ్డి వెల్లడిరచారు. క్రూరమగాలు దగ్గరకు రాకుండా ఈ మార్గాలను సురక్షిత జోన్లుగా మార్చడమే రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ లక్ష్యమని తెలిపారు.

తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం మధుసూధన్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాత్రికులకు జంతువులు తారసపడకుండా చేపట్టాల్సిన స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలపై టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డితో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. చిరుత దాడిలో ఆరేళ్ల చిన్నారి మతి చెందిన ఘటన తరువాత తిరుమల కాలిబాట మార్గాలు, ఘాట్ రోడ్లలో భద్రతా చర్యలను ముమ్మరం చేసినట్టు తెలిపారు. ఏడో మైలు నుండి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు 20 రియల్ టైమ్ హై-ఫై కెమెరాలు, మరో 300 కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేశామన్నారు. మరో 500 అధునాతన సిమ్ బేస్డ్ రియల్ టైమ్ కెమెరా ట్రాప్ లను కొనుగోలు చేసి ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటివరకు ఐదు చిరుతలను బంధించి ఎస్వీ జూపార్కుకు తరలించామని తెలిపారు. అలిపిరి నడకమార్గంలోని దుకాణాల్లో ఆహార వ్యర్థాలను పడేస్తుండడం వల్ల, వీటి కోసం జింకలు, అడవిపందులు, కుక్కలు వంటి జంతువులు వస్తున్నాయని చెప్పారు. ఈ జంతువుల కోసం చిరుతలు, ఎలుగుబంట్లు ఇటువైపు వస్తున్నాయని, ఈ కారణంగా ఆహారపదార్థాలు విక్రయించే దుకాణాలపై ఆంక్షలు విధించామని తెలిపారు. నడకమార్గాల్లో సాధారణ స్థితి నెలకొనే వరకు సెక్యూరిటీ గార్డు తోడుగా 100 మంది భక్తులను గుంపులుగా పంపడం, 12 ఏళ్లలోపు పిల్లలను మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే అనుమతించడం, ఉదయం 6 నుండి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాలు అనుమతించడం వంటి చర్యలు కొనసాగుతాయని ఆయన చెప్పారు. శేషాచల కొండలు అరుదైన వక్షజాలం, జంతుజాలంతో గొప్ప ప్రకతి సౌందర్యాల నిధిగా ఉన్నాయన్నారు. నూతన నడక మార్గాల్లో యాత్రికులు ప్రకతి అందాలను వీక్షించి గొప్ప అనుభూతిని పొందుతారని, వన్యప్రాణులు హాయిగా సంచరిస్తాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అటవీ సంరక్షణాధికారి నాగేశ్వరరావు, టీటీడీ డెప్యూటీ సీఎఫ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అక్రమ పట్టాలు రద్దు చేయాలని దీక్ష

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

దీక్షలకు మద్దతు తెలుపుతున్న అంగేరి పుల్లయ్య

శ్రీకాళహస్తి రూరల్ మండలం అక్కుర్తి గ్రామం పరిధిలో దళితులు సాగు చేసుకుంటున్న భూములపై అగ్రకులస్తులకు జారీ చేసిన అక్రమ పట్టాలను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అంగేరి పుల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయం ఎదుట అక్కుర్తి గ్రామానికి చెందిన బాధిత దళితులు మంగళవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. వీరి దీక్షకు సీపీఎం నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ అక్కుర్తి రెవెన్యూ పరిధిలోని సర్వే నం.73, 382లలో సుమారు 9 ఎకరాల దరఖాస్తు భూమిని ఆ గ్రామానికే చెందిన పది దళిత కుటుంబాల వారు 40 ఏళ్లుగా చేసుకుంటున్నారని చెప్పారు. సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు జారీ చేయాలని ఏళ్ల తరబడి కాళ్లరిగేలా తిరిగినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. అయితే ఆ భూములకు ఎలాంటి సంబంధంలేని అగ్రకులస్తులకు మాత్రం గుట్టు చప్పుడు కాకుండా పట్టాలు జారీ చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి అగ్రకులస్తులకు జారీ చేసిన అక్రమ పట్టాలను రద్దు చేసి దళితులకివ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే రిలే దీక్షలు కాస్త ఆమరణ నిరాహార దీక్షలవుతాయని హెచ్చరించారు. సీపీఎం నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య, వెలివేంద్రం, అక్కుర్తి దళితులు పాల్గొన్నారు.

జయశంకర్ కాలనీలో విద్యుత్ పోల్స్ మార్పు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీలో గల జయశంకర్ కాలనీలో ఏదేనీ గాలి, వర్షం వచ్చినప్పుడు విద్యుత్ అంతరాయం ఏర్పడేది. దాదాపు 15 సంవత్సరాలకు మునుపు ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభాలు కాలానుగుణంగా ఒరిగిపోతుండడంతో మంగళం సబ్ స్టేషన్ ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్ హరి దష్టికి స్థానిక ప్రజలు వినతి రూపంలో సమస్యను తెలిపారు. స్పందించిన ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్ హరి త్వరలో పాత విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు మంగళవారం యుద్ధ ప్రతిపాదికన ఒక రోజులోనే పాత స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ పునరుద్ధరణ చేయడంతో స్థానికులు ఏఈ హరికి కతజ్ఞతలు తెలిపారు.

'హై'టెన్షన్'



ఇళ్లపైనే వేలాడుతున్న విద్యుత్ తీగలు

భయం గుప్పెట్లో విందూరు, చెన్నూరు దళితవాడలు

ప్రజాశక్తి - గూడూరు రూరల్

దళిత కాలనీల్లో మౌలిక వసతుల మాట అటుంచు.. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతికే రోజులు.. ఇళ్లపై విద్యుత్ తీగలు వేలాడుతుంటే, ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బతికేస్తున్నారు. అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో తమ 'చావు' తాము చస్తున్నారు.

గూడూరు మండల పరిధిలోని దళిత కాలనీలపై వేలాడుతున్న విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉన్నా విద్యుత్ శాఖ అధికారులకు చలనం లేదని దళితుల పట్ల చిన్నచూపు చూపిస్తున్నారని ఆ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా గూడూరు మండల పరిధిలోని విందూరు, చెన్నూరు దళితవాడల నివాసాలపై హై టెన్షన్ విద్యుత్తు వైర్లు తీగల్లా వేలాడుతూ ఉండడం వల్ల ఆ ప్రాంత కాలనీవాసులు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని భయభయంగా జీవిస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేవా అనే విషయాలను ప్రత్యక్షంగా చూసేందుకు ఎమ్మెల్యేలు గడపగడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభించారు. గూడూరు మండలంలో గడగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ వరప్రసాద్ రావు పాల్గొన్నప్పుడు విందూరు,చెన్నూరు దళిత వాడ ప్రజలు తమ ఇళ్లపై విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రాణ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాటిని మార్చి మాకు రక్షణ కల్పించాలని ఆ ప్రాంత దళితులతో పాటు టిడిపి ఎస్సీ సెల్ గూడూరు నియోజకవర్గ ఉపాధ్యక్షులు కల్లూరు రవి అనేక సార్లు వినతి పత్రాలు అందించినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలను మార్చి ప్రాణ బిక్ష పెట్టాలని కోరుతున్నారు.

ఎర్రచందనం పట్టివేత- స్మగ్లర్ అరెస్టు

ప్రజాశక్తి- యర్రావారిపాలెం: భాకరాపేట అటవీ శాఖ అధికారులకు అందిన రహస్య సమాచారం మేరకు తలకోన అటవీ ప్రాంతంలో నార్త్ బీట్ కాటుక కనుమ సమీపంలో నరబైల, ఎలమంద పోస్ట్ అధికారులు సోమవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా స్మగ్లర్లు ఎర్రచందనం కొయ్యలు మోసుకొని వెళుతుండగా అటవీ శాఖ అధికారులను చూసి కింద పడి వేసి దట్టమైన అటవీ ప్రాంతంలోకి పారిపోతుండగా తమిళనాడుకి చెందిన రామనందం, పరుశురాంను పట్టుకున్నామని అధికారులు తెలిపారు. ఈ దాడిలో 9 ఎర్రచందనం దుంగలు పట్టుకున్నారు. వీటి బరువు సుమారు 310 కేజీలు ఉండగా 11 లక్షలు విలువ చేస్తాయని అధికారులు అంచనా వేశారు. పారిపోయిన వారికోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని వారు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.ఈ దాడిలో ఎఫ్ ఎస్ ఓ సలావుద్దీన్,ఎఫ్ బి ఓ లు ప్రదీప్ చాంద్,రాజేష్ , నికిల్,శంకర్, బేస్ క్యాంప్ సిబ్బంది, ప్రొటెక్షన్, వాచర్లు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఎర్రచందనం స్మగ్లర్, స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు

పుత్తూరులో ట్రాఫిక్ ఆంక్షలు:ఎస్ఐ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పట్టణంలో వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించామని ఎస్ఐ వెంకటమోహన్ తెలిపారు. దుకాణాల ముందు ద్విచక్ర వాహనాలు నిలిపి, ట్రాఫిక్కు అంతరాయం కలిగించడం, టీ దుకాణాలలో గంటల తరబడి కూర్చోవడం, సిగరెట్ తాగడం, రోడ్డుకు ఇరువైపులా ఎక్కడ ఐతే అక్కడ ద్విచక్ర వాహనాలను నిలిపివేయడం చేయకూడదని ఆయన తెలిపారు. దుకాణాల ముందు ద్విచక్ర వాహనాలు పార్కు చేసి గంటల తరబడి ఉంటే యజమాని దారుడే బాధ్యుడని, దీనికి తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. ద్విచక్ర వాహనాలతో ఎలాంటి సమస్యలు వున్నా 100కు డయల్ చేయాలన్నారు. మద్యం సేవించి, ద్విచక్ర వాహనం నడిపినా, ద్విచక్ర వాహనంపై ముగ్గురు వెళ్లినా, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోయినా అధిక శబ్దంతో ద్విచక్ర వాహనంపై వెళ్లినా కఠినమైన చర్యలు తప్పవని ఎస్ ఐ హెచ్చరించారు.

కాసరం గ్రామ తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి -తొట్టంబేడు:తొట్టంబేడు మండలంలోని కాసరం పాత దళితవాడలో పది రోజు లుగా తాగునీరు లేక ఇబ్బంది పడుతు న్నారని తెలిసిన జాతీయ విని యోగ దారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి వారి దాహార్తిని తీర్చారు. కాసరం పాత దళితవాడలో తాగునీటి బోరు పది రోజుల క్రితం మరమ్మతులకు గురైంది. దళితవాడ వాసులు ఈ విషయాన్ని సచి వాలయ ఉద్యోగులకు తెలిపారు. దళితవాడలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు విన్నవించారు. అయినా వారు పట్టించు కోలేదు. దీంతో గ్రామస్థులు ఈ సమస్యను జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దళితవాడ వాసుల సమస్యను విన్న ఆయన వెంటనే స్పందించి దళితవాడలోని 80 ఇళ్లకు పైగా మినరల్ వాటర్ ను పంపించి వారి సమస్యను పరిష్కరించారు. స్పందించి తమ సమస్యను పరిష్కరించిన భరత్ రెడ్డికి వారు ధన్యవాదాలు తెలిపారు.

ఇస్కాన్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ :ఇస్కాన్ నిర్వహించిన వివిధ పోటీల్లో శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు సత్తా చాటి 11 బహుమతులు గెలుపొందారని ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరిదేవి తెలిపారు. చర్చా గోష్టి మొదటి బహుమతి, ప్రోత్సాహక మొదటి బహుమతులు, తెలుగు వక్తృత్వం పోటీలలో మొదటి, రెండవ బహుమతులు, ప్రోత్సాహక మొదటి బహుమతి గెలుపొందారు. వ్యాసరచన పోటీలో మొదటి, రెండవ బహుమతి, మూడవ బహుమతి, ప్రోత్సాహక మొదటి బహుమతి, ప్రోత్సాహక రెండవ బహుమతి గెలుచుకున్నారు. వీరందరినీ తిరుపతి ఇస్కాన్ అధ్యక్షులు రేవతి రమణ దాస్, నిత్యముక్తదాస్ అభినందించి రాధాకృష్ణ ప్రతిమలు, ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందించారు. వీరిని కళాశాల అధ్యక్షులు డా. సి. భువనేశ్వరి చదువు తో పాటు ఆధ్యాత్మిక, నైతిక విలువలను పెంపొందింప చేసుకునే భగవద్గీత, భాగవత ఇతిహాసాల్లో ఉన్న సారాన్ని తెలుసుకునే ప్రక్రియలో భాగంగా పాల్గొన్నందుకు ఎంతో హర్షించదగ్గ విషయ మన్నారు. విజేతల అభినందన కార్యక్రమంలో సంస్కృత అధ్యాపకులు భవాని ప్రసాద్, డా. స్నేహలత, అధ్యాపకులు, విద్యార్థులు పా ల్గొన్నారు.

కొత్తపాలెం బ్రాంచ్ పోస్ట్ మాస్టరుకు బెస్ట్ మోటివేటర్ అవార్డు

అవార్డు అందుకుంటున్న అనురాధ

ప్రజాశక్తి -కోట : గూడూరు డివిజన్ స్థాయిలో తపాలా శాఖలోని పథకాలను ప్రజలకు అందచేయడంలో మెరుగైన సేవలను అందించినవారిని ఈ రోజు సత్కరించారు. ఈ సందర్భంగా తపాలా శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన ఉత్తమ సేవలు అందించినందుకు కోట మండ లం కొత్తపాలెం బ్రాంచి పోస్టు మాస్టర్ గా యస్.అనురాధ డివిజన్ స్థాయిలో ప్రతిభ కనపర్చడంతో గూడూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఏ.వి.యస్. కె.కె. కుమార్ వారిని ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ అసిస్టెంట్ సూపరిం టెండెంట్ నార్త్, సౌత్ సబ్ డివిజన్ల ఇన్స్పెక్టర్లు సుధాకర్, సుధీర్ బాబు,తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు.

అలరించిన అడిక్షన్ ఫ్యాషన్ వీక్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: మిత్ర ఫౌండేషన్ ఎన్జీవో ప్రోత్సాహంతో కేజేయం డ్రీమ్ ఎంటరుటైన్మెంట్ సంస్థ కవిత కిషోర్, రియానిష్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన అడక్షన్ ఫ్యాషన్ వీక్ 2023 పలువురిని అలరించింది. స్థానిక శిల్పారామం లో మంగళవారం జరిగిన కార్యక్రమానికి బ్రాండ్ అంబాసిడరన్ ఐకాన్ దివ్య 2023 విన్నర్ భావన చినతంబు ఓకే అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వల అనంతరం ఆమె మాట్లాడుతూ లోకల్ టాలెంట్ నువ్వు గుర్తించి వారిని ప్రోత్సహించే ఉద్దేశం లో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభివృద్ధి నియమన్నారు. ఇలాంటి వాటిని ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను చాటాలని పిలుపు నిచ్చారు. అనంతరం దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి హాజరైన మోడల్స్ తమ అంద చందాలతో, ఫ్యాషన్ డిజైన్ వస్త్రాలతో అందరిని అలరింప చేశారు. ఈ కార్యక్రమంలో పూర్ణచంద్రారెడ్డి, రాగిపాల బాలాజీ, గోపికృష్ణ, మోహన్ రెడ్డి, పెద్దపూడి ప్రసాద్ రావు, దామోదర్‌రెడ్డి, మల్లిక్ పాల్గొన్నారు.

జక్కా వెంకయ్య శ్రామిక నగర్‌కు వెలుగులు

- సీపీఎం నాయకుల చొరవతో స్పందించిన ఆర్‌డివో
- అపరిష్కృత సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి -గూడూరు : గూడూరు లోని జక్కా వెంకయ్య శ్రామిక నగర్‌లో గూడూరు ఆర్‌డీవో కిరణ్ కుమార్ వెలుగులు నింపారు. స్థానిక సీపీఎం నాయకులు దీర్ఘకాలిక సమస్యలు ఆర్‌డీవో దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆర్‌డీవో మంగళవారం ఆప్రాంతాన్ని తనిఖీ చేసి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జక్కా వెంకయ్య శ్రామిక నగర్‌లో 21 ఏళ్లుగా 52 కుటుంబాలకు చెందిన ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు, నిరుపేదలు నివసిస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంత మంది అధికారులు మారినా, వారి సమస్యలు పరిష్కారానికి నోచుకోక సమస్యల వలయంలో నివసిస్తున్నారు. తుఫాన్లు వచ్చినా, వరదలు వచ్చినా, ఏర్లు పొంగినా ముందు మునిగే ప్రాంతం జక్కా వెంకయ్య శ్రామిక నగర్.. అక్కడ నివసిస్తున్న నిరు పేదలు విషసర్పాలతో, దోమల బాధలతో, పేరుకుపోయిన మురికి వాడల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. ఈ సమస్యలపై గూడూరు సీపీఎం నాయకులు వెంటనే స్పందించి గూడూరు ఆర్‌డీవో ఎం.కిరణ్ కుమార్ దృష్టికి సమస్యలు స్పందనలో వివరించారు. స్పందించిన ఆడ్‌డీవో సీసీరోడ్లు, మురికి నీళ్లు వెళ్లేందుకు ఇరువైపులా కాలువలు ఏర్పాటు చేశారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలు సిసి రోడ్ల నిర్మాణం, డ్రైనేజీలు ఏర్పాటు చేయడంతో ఆర్‌డీవోకి ఆ ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రజలు ఆయనకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి సత్కరించారు. డ్రైనేజ్‌లు ఏర్పాటు చేస్తామని, నివాసాల మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ను ఎవరికి ప్రాణహాని లేని చోటికి మార్చడం, మిగిలి ఉన్న సి.సి రోడ్లు పూర్తి వంటి పనులు వెంటనే అమలు చేస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి జోగి శివకుమార్, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, సురేష్, భావన నిర్మాణ సంఘం గౌరవాధ్యక్షులు పుట్టా శంకరయ్య, ఆటో యూనియన్ నాయకులు బి.వి రమణయ్య, బి. చంద్రయ్య, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఆర్‌డివో కిరణ్‌కుమార్

తిరుపతి డిఆర్ఓగా పెంచల కిషోర్

ఘనంగా సన్మానించిన ఆర్టీఓ కిరణ్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు : తిరుపతి జిల్లా జిల్లా రెవెన్యూ అధికారిగా పెంచల కిషోర్ బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం గూడూరు ఆర్టీఓ కిరణ్ కుమార్ నూతనంగా విధుల్లోకి బాధ్యతలు స్వీకరించిన పెంచల కిషోర్ ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి, పూలమొక్క అందించి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.

ఫల సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యం లో మంగళవారం ఫల సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ 3160 డిస్టిక్ గవర్నర్ మాణిక్ పవార్, శిల్ప పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోటరీ వెస్ట్ క్లబ్ సభ్యులతో క్లబ్ కార్యక్రమాలు, రోటరీ ఫౌండేషన్ ఆవశ్యకతను వివరించారు. సేవా కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా రొటేరియన్ నాగరాజు కుమార్తె స్పందన జన్మదినాన్ని పురస్కరించుకుని రోటరీ చేయూత ద్వారా పేదలకు ఫల సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో పిడిజి బొమ్మిరెడ్డి సురేందర్ రెడ్డి, ముని గిరిష్, అసిస్టెంట్ గవర్నర్ శ్యాం యాదవ్, ప్రసిడెంట్ సనత్ కుమార్ రెడ్డి, సెక్రెటరీ శివప్రసాద్, సీనియర్ రొటేరియన్స్ దశరథ రామి రెడ్డి, రామ్మోహన్ పాల్గొన్నారు.

14, 16 తేదీల్లో మండల క్రీడల పోటీలు

ప్రజాశక్తి -కోట : ఈ నెల14,16వ తేదీలలో ఎస్‌జిఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలను, క్రీడాకారుల ఎంపికను చేపట్టనున్నట్లు ఎమ్ ఈ ఓ శైలజ, దారా మస్తానయ్య, కోట ఎవికెఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి సురేంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ ఈ పోటీలు కోట లోని ఎవికెఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని తెలిపారు. 14వ తేదీన బాలికలకు కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, త్రో బాల్, వాలీబాల్, టెన్నీకాయిట్, యోగా, అథ్లెటిక్ 16వ తేది బాలురకు మిగిలిన క్రీడాంశాలు జరుగుతాయని మండల కో ఆర్డినేటర్,వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. అండర్ 14,17లో బాల బాలికలకు పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేస్తామని ఎస్‌బీఎస్ సమన్వయకర్త షేక్ వలీ అహ్మద్ తెలిపారు.

టిడిపి నాయకుల హౌస్ అరెస్టు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో నిరసన తెలిపిన భానుప్రకాష్ పిఎ ఎఎంఙె మని క్రిష్ణ, పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు, పుత్తూరు మున్సిపాలిటీ 22వ వార్డు కౌన్సిలర్ గాలి జీవరత్నం నాయుడు హౌస్ అరెస్ట్ చేశారు. అరెస్టును ఖండిస్తూ వేపగుంట క్రాస్ వద్ద టైరు కాల్చి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పుత్తూరు పట్టణంలోటిడిపి ఆధ్వర్యంలోనల్ల జెండాలతో నగరి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి గాలి భాను ప్రకాష్ నిరసన తెలిపారు. చిత్తూరు పార్లమెంటరీ బీసీ సెల్ ప్రసిడెంట్ షణ్ముగరెడ్డి హౌస్ అరెస్ట్‌చేశారు. నిరసన తెలిపిన ఆ పార్టీ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్ ని పోలీసులు అరెస్టు చేశారు.

క్లినికల్ సైకాలజీ ప్రయోగశాల విద్యార్థులకు ఉపయోగకరం

- ఉపకులపతి ఆచార్య డి భారతి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యా లయంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్లినికల్ సైకాలజీ ప్రయోగశాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వర్సిటీ ఉపకులపతి ఆచార్య డి. భారతి పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి చెందిన క్లినికల్ సైకాలజీ విభాగంలో మంగళవారం నూతన క్లినికల్ సైకాలజీ ప్రయోగశాలను విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ డి భారతి ప్రారం భించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్, సైకాలజీ విభాగా ధిపతి ఆచార్య ఎన్. రజిని, ప్రొఫెసర్ డి భారతి మాట్లాడుతూ ఈ ప్రయోగశాల ద్వారా మానసిక విద్యను అందించడం, ఆరోగ్య సమస్య లు, రుగ్మతలను నిర్ధారిం చడంలో పరీక్ష లు మూల్యాంకం అని తెలి పారు. మనోవిజ్ఞాన శాస్త్రం విద్యార్థులకు ఈ ప్రయోగశాల ఎంతో ఉపయో గకరంగా ఉంటుం దన్నారు. క్లినికల్ సైకాలజీ ప్రయోగశాల వల్ల ఎన్నో మానసిక రుగ్మతలు కలిగిన వ్యక్తులకు పరిష్కార మార్గాలు చూపించేందుకు ఈ ప్రయోగశాల ఎంతో ఉపయోగపడ రమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పి.సుజాత, సైన్స్ డీన్, సైకాలజీ విభాగ అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : తిరుపతి జిల్లా దొరవారి సత్రం మండలంలోని ఏకొల్లు జిల్లా పరిషత ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష లో భాగంగా సోమవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా దొరవారిసత్రం పి హెచ్ సి డాక్టర్ చైతన్య పర్యవేక్షణలో ఆప్తమాలజిస్ట్ లలిత్ కుమార్ దృష్టిలోపాలను గుర్తించారు. దూర దృష్టి లోపాలు ఉన్న వారిని గుర్తించి వారి చూపునకు తగిన లెన్స్ పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఆరుగురి విద్యార్థినులకు ఉచిత కళ్లజోడు అందించేందుకు సిఫార్సు చేశారు. వైద్యాధికారి చైతన్య మాట్లాడుతూ ఇలాంటి దృష్టి లోపాలు రాకుండా ఉండాలంటే ప్రధానంగా విటమిన్ ఏ కలిగిన ఆకుకూరలు, క్యారెట్ లాంటి, పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను అధిక మోతాదులో తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం ధనంజయ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్ పాల్గొన్నారు.

ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్‌ను కలిసిన నారాయణబాబు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్ర రెడ్డి ని తిరుపతి ఎస్‌వి యూనివర్సిటీ ఈసీ మెంబర్ సి నారాయణ బాబు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం అభివృద్ధికి, విద్యాలయ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి విశ్వవిద్యాల అభివృద్ధితో పాటు సమస్యలను పరిష్కరించాలని నారాయణ బాబు కోరారు.

రేపు వెటర్నరీ వర్సిటీలో జాతీయ సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలోని వెటర్నరీ అండ్ ఏహెచ్ ఎక్స్టెటెన్షన్ విభాగం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 14, 15 తేదీలలో రెండు రోజులపాటు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఆచార్య జిఆర్ కె శర్మ పేర్కొన్నారు. మంగళవారం పశువైద్య కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయంలో విలేకరులతో అసోసియేట్ డీన్ ఆచార్య పి. జగపతి రామయ్య మాట్లాడుతూ వర్సిటీలో 1995 నుంచి వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందిన వెటర్నరీ విస్తరణ విభాగం పలు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ముఖ్యంగా పశు వైద్యానికి సంబంధించి, వ్యవసాయానికి సంబంధించి ప్రత్యేకమైన మెలకువలు, అధిక ఆదాయం పొందే పద్ధతులపై క్షేత్రస్థాయిలో శిక్షణ కార్యక్రమాలను రైతులకు నిర్వహిస్తుందన్నారు. ప్రస్తుత జాతీయ సదస్సుకు దాదాపుగా 200 మంది వివిధ రాష్ట్రాల నుంచి పశువైద్య శాస్త్రవేత్తలు, వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్లు, పరిశోధకులు హాజరవుతారన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య జిఆర్కె శర్మ మాట్లాడుతూ ఈ రెండు రోజులపాటు జాతీయ సదస్సులో ముఖ్యంగా ఐదు ప్రధాన అంశాలపై నిర్వహిస్తారని, 'సుస్థిరమైన గ్రామీణ జీవనోపాధి సామాజిక, ఆర్థిక, సాంకేతిక అంశాలపై కావలసిన విధివిధానాలు ధ్రువీకరించవలసిన మార్గాలు" అనే అంశంపై ఈ రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. విశ్వవిద్యా లయంలో జరిగే పరిశోధనలు దాని ప్రతిఫలాలు క్షేత్రస్థాయిలోనే రైతులకు అందేందుకు ముఖ్య సాధనంగా విస్తరణ విభాగం పని చేస్తుందన్నారు. ఈ రెండు రోజుల జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ టు గవర్నమెంట్ ఏహెడ్‌డి అండ్ డిపార్టుమెంట్ గోపాలకృష్ణ ద్వివేది, కర్ణాటక పశువైద్య విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య కేసి వీరన్న, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య డి.భారతి, ఐజర్ డైరెక్టర్ ఆచార్య శాంతను భట్టాచార్య, చెన్నై విస్తరణ విద్యా విభాగం డైరెక్టర్ ఆచార్య వి. అప్పారావు, ఎస్‌వియు డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెటెన్షన్ ఆచార్య జి.వెంకట్ నాయుడు హాజరవుతారని వెల్లడించారు. ఈ సదస్సుకు అధ్యక్షుడిగా పశువైద్య విశ్వవిద్యాలయం డీన్ ఆచార్య కె.వీరబ్రహ్మయ్య వ్యవహరిస్తారని వెల్లడించారు. ఈ సమావేశంలో కో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ త్రివేణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఆచార్య జిఆర్ కె శర్మ.

బిగ్ బాస్ అసోసియేట్ స్పాన్సర్‌గా హైయర్ ఇండియా

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: గృహోపకరణాలలో గ్లోబల్ లీడర్, హైయర్ అప్లయెన్సెస్ ఇండియా (హైయర్ ఇండియా) రియాలిటీ షో బిగ్ బాస్ తెలుగు సీజన్ 7 కోసం అసోసియేట్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షులు సతీష్ ఎన్ ఎస్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టెలివిజన్ షోలలో ఒకటైన 'బిగ్ బాస్ 7 తెలుగు షోను వినూత్నమైన పద్ధతులు అందరిని ఆకర్షించేలా అందిస్తున్నారు. రెండో రాష్ట్రాల తెలుగు ప్రజలతో పాటు ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రేక్షకులు దీనిని ఆదరించడం అభినందనీయమన్నారు. సాంకేతికతతో నడిచే గృహోపకరణాలను అందించడం ద్వారా భారతీయ వినియోగదారుల రోజువారీ జీవితంలోభాగం కావడానికి హైయర్ ఎల్లప్పుడూ కృషి చేస్తోంది. అలాంటి సంస్థ బిగ్ బాస్ 7ను సమర్పించి, ప్రేక్షకులకు అందించడం శుభపరిణామం అన్నారు. తమ వినియోగదారులు, ప్రజలు ఈ కార్యక్రమాన్ని వీక్షించే ఆదరించాలని కోరారు.

నాగబాబు పర్యటన విజయవంతం చేయండి: జనసేన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జనసేన బలోపేతం కోసం జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు జిల్లాలో పర్యటించనున్నారని, నాగబాబు పర్యటనను విజయవంతం చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ పార్టీ క్యాడర్ కు దిశా నిర్దేశం చేశారు. మంగళవారం ఈ మేరకు పిఎసి కార్యాలయంలో పార్టీ క్యాడర్ తో నాగబాబు పర్యటన కార్యచరణపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఆ పార్టీ తిరుపతి ఇంచార్జి కిరణ్ రాయల్, పట్టణ అధ్యక్షులు రాజారెడ్డి, పీలేరు ఇంచార్జ్ బెజవాడ దినేష్ , చంద్రగిరి నాయకులు బీగల అరుణ, రాయల్ వెంకట్, సంజీవి హరి, శ్రీకాళహస్తి ఇంచార్జి వినూత కోట, జిల్లా నాయకుడు కొట్టే సాయి, లావణ్యకుమార్, దేవ, స్వామినథన్, శివలింగం, పొన్న యుగంధర్, ఆకేపాటి సుభాషిణి, ఆనంద్, హేమకుమార్, బాటసారి, మండల అధ్యక్షులు జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్ట్ అక్రమం: టిడిపి

ప్రజాశక్తి -గూడూరు : జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు అరెస్టు అక్రమం అని మాజీ శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ తమ నాయకుడిని ఏ కారణం లేకుండా అరెస్టు చేయడం తగదని, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 4 సంవత్సరాలలో ఎంత దోపిడీ చేసిందో ప్రజలకు తెలుసు అన్నారు. ఎక్కడో ఎందుకు ఈ నియోజకవర్గంలో సిలికా, ఇసుక ద్వారా వేల కోట్లు దోపిడీ జరుగుతతోందన్నారు. టీడీపీ హయంలో రాష్ట్రంలో యువతకు నైపున్యాభివృద్ధి శిక్షణ ఎందరికో మేలు చేకూర్చిందన్నారు. అలాంటి వాటిలో కేసు బనాయించడం అన్యాయమన్నారు. అరెస్టుకు నిరసనగా చేసిన బంద్‌కు మద్దతు తెలిపిన వ్యాపారస్తులు, విద్యాసంస్థలు మద్దతు తెలపడం ఆనందదాయమని కృతజ్ఞతలు తెలుపుతున్నానమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్, గూడూరు పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు, కొండూరు వెంకటేశ్వ ర్లు రాజు,జిల్లా అధికార ప్రతినిధి బిలు చెంచురామయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి రవీంద్ర రెడ్డి, కార్యదర్శి పట్టభిరెడ్డి, బిసి నాయకులు కాకి శ్రీనివాసులు, పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు తాతపూడి ఇస్రాయెల్ కుమార్, ,నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు ఎండి అబ్దుల్ రహీం, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఎసుపాక పెంచలయ్య, పట్టణ, అనుబంధ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిరసన తెలిపితే హత్యాయత్నం కేసులా?: టీడీపీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: 'ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపితే టీడీపీ నాయకులపై హత్యాయత్నం కేసులు పెడతారా?' అంటూ ఆ పార్టీ మహిళా విభాగం నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం తెలుగు మహిళలు మీడియా సమావేశంనిర్వహించారు. టిడిపి మహిళా విభాగం తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షురాలు చక్రాల ఉషా మాట్లాడుతూ ఏ తప్పు చేయని బాబుని అరెస్టు చేయించి వైసీపీ శ్రేణులు రాక్షసానందం పొందుతున్నారని, బాబు అరెస్టును నిరసిస్తూ ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నేతలు నిరాహార దీక్ష చేస్తుంటే పోలీసులు అరెస్టు చేసి హత్యాయత్నం కేసులు పెట్టి జైలుకు పంపడం అప్రజా స్వామికం అన్నారు. జగన్ పాలనలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కూడా ప్రజలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన పోలీసులు అధికారు లు పార్టీకి కొమ్ము కాస్తూ ప్రతి పక్షాలపై అక్రమ కేసులు పెట్టడం సమంజసం కాదన్నారు. చంద్రబాబు నిర్దోషిగా బయటకు వస్తారనీ, వైసీపీకి రాష్ట్ర ప్రజలు చరమగీతం పాడి రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. కృష్ణవేణి, సుమతి, మల్లేశ్వరి, అనిత, కుమారి,లక్ష్మి, సుజాత, సునీమా, అమరావతి, రత్నమ్మ పాల్గొన్నారు.

నియంతపై పోరాటం చేస్తాం: టిడిపి

ప్రజాశక్తి -రేణిగుంట : మచ్చలేని చంద్రుడు పై మసి పూసి జగన్ ఆనందాన్ని పొందుతున్నాడని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ ధ్వజమెత్తారు. మంగళవారం రేణిగుంట పట్టణంలోని చెక్‌పోస్ట్ కూడలి వద్ద గల వై కన్వెన్షన్ హాల్ నందు ఉమ్మడి చిత్తూరు జిల్లా టిడిపి సర్వసభ్య సమావేశంను తిరుపతి జిల్లా అధ్యక్షులు నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టడం అన్యాయం అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు గౌని వారి శ్రీనివాసులు, పులివర్తి నాని, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మాజీ ఎమ్మెల్యే ఎస్సివి నాయుడు, హెలెన్ టిడిపి పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గూడూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.P. NO. 19 / 2023

Ponnuru Srinivasulu ......Petitioner

And

R1) Yellanti Suresh Reddy
2) Tenali Girish
3) Tenali Prameelamma
4) Chennuru Bhaskar Reddy
5) Rangidir Vijayalakshmi
6) Jonna Bhagyalakshmi
7) Tenali Viveka
8) Yellasiri Sarojanamma
9) Yedem Srinivasulu Reddy
10) Tenali Venkata Ramanaiah
11) Gandlapalli Lakshmi
12) Gandlapalli Sakunthalamma
13) Gandlapalli Narendra
14) Jonna Suneel Kumar
15) Vakati Seshagiri
16) Velampalli Venkata Mahalakshmi
17) Velampalli Ajith
18) Ponnuru Ravindraiah
19) Ponnuru Suganamma
20) Darsi Venkata Krishnaiah
21) Janapala Anitha
22) Janapala Sumanth
23) Nora Subramanyam
24) Jenapala Teja
25) Inukurthi Rama Naidu
26) Inukurthi Sredhar
27) Thota Uma Maheswari .....Respondents

ఆక్షేపణ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై నెంబరు I.P లో పిటిషనరు తనని Insolvent గా డిక్లేర్ చేయమని పై కోర్టులో I.P పెట్టి వున్నందున ఎవరికైనా ఆక్షేపణలు వున్నయెడల తేది.03-11-2023 పై కోర్టులో హాజరై తెలుపుకోవలసినది లేనియెడల పరోక్షమున తీర్మానించబడును.

ఇట్లు,
B. Sanjeevaiah,
K. Nithan Sai Krishna,
Advocates Gudur, Cell : 9440377805.

రుణం తీసుకున్న ప్రతి రైతుకూ రూపే కార్డు: డిసిసి బ్యాంక్ మేనేజర్

ప్రజాశక్తి -సత్యవేడు: తమ బ్యాంకులో అప్పు తీసుకున్న ప్రతి రైతుకూ రూపే కేసీసీ కార్డు అందిస్తాతమని తిరుపతి జిల్లా సత్యవేడు డిసిసి బ్యాంక్ మేనేజర్ తేజస్వి పేర్కొన్నారు. మండల పరిధిలోని మదనంబేడు రైతుభరోసా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన క్రెడిట్ అవుట్రిచ్ కార్యక్రమంపై డిసిసి బ్యాంకు అందిస్తున్న వివిధ సేవలను రైతులకు, ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిసిసి బ్యాంక్ మేనేజర్ తేజస్వి మాట్లాడుతూ డిపాజిట్లపై అత్యధిక వడ్డీని డిసిసి బ్యాంకు చెల్లిస్తోందని, ఒక సంవత్సరం నుంచి రెండేళ్లలోపు డిపాజిట్ సొమ్ము పై 7.50 శాతం,రెండు నుంచి ఐదు సంవత్సరాలలోపు 6.50 శాతం, అంతకు పైబడిన వాటికి 6.25 శాతం వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే ప్రతి డిపాజిట్ సొమ్ము పై ఇన్సూరెన్స్ గ్యారెంటీ ఉందన్నారు. డిపాజిట్ల నామినేషన్ సౌకర్యం వుందన్నారు. స్వయం ఉపాధిలో భాగంగా చిరు వ్యాపారులు ప్రతిరోజు 50 నుంచి 150 రూపాయలు 120 రోజులు చెల్లిస్తే ఈ మొత్తానికి రెండు రెట్లు రుణం , 12 శాతం వడ్డీ ఇస్తామన్నారు. ఈ రుణాన్ని 202 రోజుల్లో ప్రతిరోజూ చెల్లించాలన్నారు. బంగారం తాకట్టుపై వ్యవసాయేతర రుణ సౌకర్యం ఉందన్నారు. డిపాజిట్ దారులకు అతి స్వల్ప అద్దెతో సేఫ్ లాకర్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గృహం తాకట్టుపై మూడు లక్షల నుంచి 20 లక్షల వరకు రుణం ఇస్తున్నా మన్నారు. 13 శాతం వడ్డీతో 10 లక్షల రూపాయల లోపు 96 నెలలు, అంతకు మించిన రుణాలకు 120 నెలల పాటు వాయిదా పద్ధతిలో తిరిగి చెల్లించాల్సి ఉం దన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు వ్యక్తిగత రుణాలు మూడు లక్షల వరకు మంజూరు చేస్తున్నామన్నారు. దీంతో పాటు స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు కూడా మంజూరు ఏస్తున్నామన్నారు. డిసిసి బ్యాంకు అందిస్తున్న సేవలను రైతులు, ఖాతాదారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసి బ్యాంకు సూపర్వైజర్ శరత్ కుమార్, హార్టికల్చర్ అధికారి రాధారాణి, సచివాలయ వ్యవసాయ అసిస్టెంట్లు మదన్ మోహన్, రుద్రయ్య, విహెచ్ఎ మురళి పలువురు రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి బ్యాంక్ మేనేజర్ తేజస్వి

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE: CHITTOOR
O.S.NO.271/2017

L.Mohana ...Plaintiff

Vs

P.Krishnamoorthy Nayani ..Defendant

SUMMONS TO DEFENDANT

P.Krishnamoorthy Nayani
w/o P.Chinnabba Nayuni
D.No.6-8-129, NGOs colony
KT road, Tirupati

Please take Notice that the above suit filed by the plaintiff for specific performance of contract is posted to 27-9-2023 for your appearance before Principal Senior civil Judge, Chittoor at 10.30 a.m. either in person or through an advocate and file your objections. Otherwise your matter will be decided exparte.

Date of hearing 27-9-2023
By order of court
M.MOHAN RAJU
Advocate ,Tirupati.

మహారాజశ్రీ గూడూరు 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

DOP NO. 46 / 2022

Yaramapu Spandana ......Petitioner

And

G.D Sanjay .....Respondent

నోటీసు

To G.D Sanjay, S/o G.D Vijayakumar,
D.No. 1-98 / 18, Thummalagunta Village,
Tirupati Rural Mandal,
Present Tirupathi (Dt).

పై నెంబరు పిటిషనులో పిటిషనరు తేది. 27-08-2014 న రెస్పాండెంట్ తో జరిగిన వివాహమును రద్దు చేయమని పై కోర్టులో పిటిషను పెట్టి వున్నందున మీరు నోటీసు నిమిత్తం తేది. 26-09-2023 వాయిదా వేసినారు. కావున ఆ రోజు నీవుగాని నీ తరపున వకీలు గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

ఇట్లు,
G. Dinakar Reddy,
పిటిషనరు తరపున వకీలు, గూడూరు.